ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7 తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025





కొడితాడు ఆసరాతో గరుడపతాకం ధ్వజస్తంభం పైకెగసింది. నింగిలో రెపరెపలాడుతూ సకల దేవతా గణానికి స్వాగతం పలికింది. భక్తజనం జయజయనాదాల నడుమ బ్రహ్మోత్సవాల సంబరం ఆరంభం అయింది. తిరుమల కొండంతా దీపకాంతులతో కళకళలాడుతుండగా సీఎం చంద్రబాబు నెత్తిన పట్టు వస్త్రాలు పెట్టుకుని ఊరేగింపుగా కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీనివాసుడికి సమర్పించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి రాత్రి పెద్దశేషవాహన సేవలో పాల్గొన్నారు. సాంస్కృతిక దళాల ఆటపాటల నడుమ సాగిన వాహనోత్సవం భక్తకోటికి కనువిందు చేసింది.

తిరుమలేశుని దివ్యోత్సవం

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవం ప్రారంభం

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం : 8 - 10 గంటల మధ్య చిన్నశేష వాహనం	రాత్రి : 7 - 9 గంటల మధ్య హంస వాహనం



చిన్నప్పటి నుంచీ శ్రీవారిని చూస్తూ పెరిగా. ఏ కష్టం వచ్చినా ఆయనపైనే భారం వేస్తా. బ్రహ్మోత్సవాల్లో 14 సార్లు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశాన్ని వేంకటేశ్వరస్వామి నాకు ఇచ్చారు. ఇది ఎవరికీ దక్కని అవకాశం. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు ఉండాలి. స్వామివారికి అతిపెద్ద సంపద శ్రీవారి సేవకులే.
- పట్టువస్త్రాల సమర్పణ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజైన బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి పెద్దశేష వాహనంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడు తలల స్వర్ణశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుడి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, కళాబృందాల ప్రదర్శనలు, గోవింద నామ స్మరణల నడుమ పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు దర్శనమిచ్చాడు. అంతకుముందు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ దంపతులు, అలాగే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ వాహన మండపంలో ఉత్సవర్లను దర్శించుకున్నారు.అర్చకులు వారికి హారతి ఇచ్చి శఠగోపంతో ఆశీర్వదించారు.వాహన సేవలో మాడవీధులు సాంస్కృతిక



కార్యక్రమాలతో మార్మోగాయి. కోలాటాలు, డప్పువాయిద్యాలు, చెక్కభజన బృందాల నడుమ వివిధ దేవతామూర్తుల అలంకరణలతో కళాకారులు పాల్గొన్నారు.తొలిరోజు వాహనసేవలో భక్తుల రద్దీ తక్కువగానే కనిపించింది.

ఆగమోక్తంగా ధ్వజారోహణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం 5.43 - 6.15 గంటల మధ్య మీనలగ్నంలో జరిగిన ధ్వజారోహణ ఘట్టంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసి సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

మరిన్ని బ్రహ్మోత్సవాల వార్తలు, ఫొటోలు.. 10లో

బాబు వెనుకే తమన్

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎం చంద్రబాబు వెంటే సంగీత దర్శకుడు తమన్ ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం రాకముందే తమన్ వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లారు. కొంత సమయానికే వెలుపలకు వచ్చి అఖిలాండం నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం కుటుంబ సభ్యులతో కలిసిపోయారు. ఆ తర్వాత బయోమెట్రిక్ నుంచి తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. సాధారణంగా ఇలా బయోమెట్రిక్ నుంచి ప్రవేశించడం నిషేధం. అయితే వీఐపీతో వచ్చిన కొందరికి ఈ వెసులుబాటు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు టీటీడీ మాజీ సభ్యుడు పసుపులేటి హరిప్రసాద్ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడం విమర్శలకు దారి తీసింది.



శ్రీవారిని దర్శించుకుని వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులతో సంగీత దర్శకుడు తమన్

ఆనందంగా అమరావతికి

- 80 బస్సుల్లో బయలుదేరిన భావి ఉపాధ్యాయులు
- నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాల స్వీకరణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన.. భావి ఉపాధ్యాయులు బుధవారం అమరావతికి పయనమయ్యారు. నియామక పత్రాలు అందుకునేందుకు వీరంతా ఉత్సాహంగా కదలివెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులందరికీ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియామకపత్రాలు అందజేయనున్నారు. ఈనెల 18నే ఈ కార్యక్రమం జరగాల్సి ఉన్నా, భారీ వర్షాల వల్ల 25వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నియామక పత్రాలు అందుకోవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 1532 మందికి గాను 1484 మంది, వారి సహాయకులు మరో 1484 మంది 80 బస్సుల్లో బుధవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 48 మంది వెళ్లలేకపోయారు. వీరందరికీ 380 మంది రూట్ ఆఫీసర్లు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. అభ్యర్థులకు రవాణా, వసతి ప్రభుత్వమే కల్పించిందన్నారు.



సహాయకులతో కలిసి బస్సులో బయలుదేరిన డీఎస్సీ అభ్యర్థులు

ఉదయం 5 నుంచే రిజిస్ట్రేషన్

ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు వేకువజామున 4 గంటలనుంచే తిరుపతి- రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడం మొదలు పెట్టారు. దీంతో ఉదయం 5 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. 9.30 గంటలకంతా వీరి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అల్పాహారం తీసుకున్నాక 10 గంటలకు అమరావతికి బస్సులు బయలుదేరాయి. అభ్యర్థులు, సహాయకులే కాకుండా వీడ్కోలు పలికేందుకు ఇతర కుటుబ సభ్యులుకూడా ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది.

మధ్యాహ్న భోజనం: కొందరికి గూడూరు, మరికొందరికి నెల్లూరు

రాత్రి బస: గుంటూరు

డీఎస్సీకి ఎంపికైంది: 1532 మంది
(మహిళలు 774, పురుషులు 758)
అమరావతికి వెళ్లింది: 1,484 మంది
(మహిళలు 729, పురుషులు 755)
వివిధ కారణాలతో వెళ్లనివారు: 48 మంది
సహాయకులు: మరో 1,484 మంది
రూట్ ఆఫీసర్లు: 380 మంది
సిబ్బంది సహా మొత్తం: 3,368 మంది

బ్రహ్మోత్సవాలకు అటవీ శాఖ సిద్ధం

మంగళం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అటవీశాఖ సిద్ధమైంది. నడకదారి భక్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అక్టోబరు 2 వరకు సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. ఎస్వీ జూపార్కుకు చెందిన ఇద్దరు స్నేక్ క్యాచర్లను తిరుమలలో ఉంచాలని నిర్ణయించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద చిరుత సంచారం నేపథ్యంలో ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు బీట్ ఆఫీసర్ 15మంది వాచర్లు, వెటర్నరీ డాక్టర్‌ను నియమించారు. నడక దారిలో చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగుల సంచారంపై అటవీశాఖ ప్రత్యేక నిఘా ఉంచింది.

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా), చిత్తూరు

ఆర్.ఒ.సి.నెం.04/2025/చుడా తేది: 24 .09.2025.

ముసాయిదా ప్రకటన

ఆంధ్ర ప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ & పట్టణాభివృద్ధి సంస్థ చట్టం, 2016, లోని సెక్షన్ 15 (1) ద్వారా ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది:24.08.2022న ననుసరించి ప్రతిపాదించడ మైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15(పదిహేను) రోజుల లోపల ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు వలన వ్యక్తులు లేదా సంస్థలకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు వారికి వ్రాతపూర్వకముగా తెలిపిన విషయములను ముఖ్య కార్యదర్శి, పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్ర ప్రదేశ్ప్రభుత్వం, రాష్ట్ర సచివాలయం, వెలగపూడి వారికి, వారి పరిశీలన మరియు తగు చర్యల నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది: 24.08.2022 నందు ఆమోదించబడిన బృహత్తర ప్రణాళికా యందు చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ భూ వినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు 72.చిత్తూరు రెవిన్యూ గ్రామం లోని సర్వే సంఖ్య. 230, 231/1A, 231/1B1 & 232/1 లో ఎ. 10.35 సెంట్లు లేదా 50,094 చ.గ. విస్తీర్ణము కలిగి ప్రతిపాదిత వాణిజ్య (ఇండస్ట్రియల్) వినియోగ కేంద్రం రద్దు చేయుటకు మరియు సదరు స్థలమును మిశ్రమ వినియోగ కేంద్రం నకు మార్పుదల చేయుచూ మరియు బృహత్తర ప్రణాళిక యం.యం.పి. సంఖ్య. 01/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించడమైనది.సదరు ముసాయిదా భూ వినియోగ మార్పు సంఖ్య. 01/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు కార్యాలయములో పనిదినముల వేళయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

భూ వినియోగ మార్పు భూమి హద్దులు

ఉత్తరము: ప్రస్తుత 30 మీటర్ల వెడల్పు గల చిత్తూరు – పలమనేరు రోడ్డు (సర్వే సంఖ్య. 229), దక్షిణము :శంకరయ్య గుంట గ్రామము
తూర్పు: ప్రస్తుత 12మీటర్ల వెడల్పు గల చిత్తూరు – శంకరయ్య గుంట గ్రామము రోడ్డు (సర్వే సంఖ్య. 260), పడమర : బివి రెడ్డి పెట్రోలు బంకు

సం/- ఉపాధ్యక్షులు,
చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు






అమ్మవార్లకు శరన్నవరాత్రి అలంకరణలు

సూళ్లూరుపేట: అన్నపూర్ణగా చెంగాళమ్మ అమ్మవారు

చిల్లకూరు: గాయత్రీదేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ

తిరుపతి: గాయత్రీదేవి అలంకారంలో తాతయ్యగుంట గంగమ్మ

శ్రీకాళహస్తి: తపస్సు అలంకారంలో జ్ఞానప్రసూనాంబ



వికసిత్‌భారత్ లక్ష్యంగా ఏఐసీటీఈ ప్రణాళిక

తిరుపతి రూరల్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకునే దిశగా సాంకేతికవిద్య పాఠ్య ప్రణాళికని అమలు చేస్తున్నామని ఏఐసీటీఈ మెంబర్‌సెక్రటరీ ప్రొఫెసర్ శ్యామ్‌రథ్ పేర్కొన్నారు. సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం)సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం-సాంకేతికవిద్య అభివృద్ధి అనేఅంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఆమె మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించిన వికసిద్భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశంలో ఐదుల క్షలమంది అధ్యాపకులకు అధునాతన సాంకేతికతపై శిక్షణ ఇచ్చారన్నారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ కృత్రిమమేధ, చాట్ జీపీ సాంకేతికత సామర్థ్యాన్ని మరింతగా పెంచుకుని, అధునాతన సాంకేతికతని విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సదస్సులో దాదాపు 300మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్రఅధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ ఎం.లక్ష్మణరావు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రటరీ వై.ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, కన్వీనర్ డాక్టర్ సురేష్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు




చంద్రగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి హైవేలో బుధవారం తెల్లవారు జామున మినీ లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు కళ్యాణదుర్గం నుంచి మినీ లారీ భాకరాపేట ఘాట్ రోడ్డులో బోల్తా పడుతుంది. డ్రైవర్ వంశీ, క్లీనర్ శ్యామ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రుయా ఆసుపత్రికి తరలించారు.












స్వాగతం సుస్వాగతం
తెలుగుజాతి కీర్తికి మకుటంలేని మహారాజు..
స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు నిరంతరం కృషి చేస్తున్న రాజర్షి,
మా ఆత్మీయ నేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కుటుంబసమేతంగా
శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలకు
విచ్చేసిన శుభ సందర్భంగా మీకు మీ కుటుంబానికి
మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు
నైనార్ మహేష్ యాదవ్
ఛైర్మన్, శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం
తెలుగుదేశం పార్టీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి


హార్ధిక శుభాకాంక్షలు
స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త, అమరావతి రూపశిల్పి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
శ్రీమతి & శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఐ.టి. శాఖామంత్రి వర్యులు శ్రీమతి & శ్రీ నారా లోకేష్ గార్లు
కుటుంబ సమేతంగా విచ్చేసి
కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి
బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించిన
శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
మీకు ఆ శ్రీనివాసుని ఆశీస్సులు ఎల్లప్పుడూ మెండుగా వుండాలని
మనసారా కోరుకుంటూ ... మీ...
కుప్పాల గిరిధర కుమార్
తిరుపతి


శ్రీవారికి పట్టు వస్త్రములు సమర్పించిన
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటు...
ఆర్.సి. మునిక్రిష్ణ
డిప్యూటీ మేయర్
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్



సేవింతురే!

బ్రహ్మోత్సవాలకు నాంది పలికిన పల్లవరాణి సామవై



చిత్రం: సింగంపల్లి సత్యనారాయణ

తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టింది పల్లవరాణి సామవై. క్రీ.శ.966లో ఆమె వెండితో రూపొందించిన భోగశ్రీనివాసమూర్తిని ఆలయంలో ప్రతిష్ఠించారు. మూల విగ్రహానికి సామ్యంగా అమరిన ఈ ఉత్సవమూర్తిని మనవాళ పెరుమాళ్ అనేవారు. వైభవోపేతంగా సాగిన ఆనాటి ప్రతిష్ఠాపన క్రతువే తిరుమల ఉత్సవాలకు నాంది అని అంటారు. ఏడాదికి రెండు బ్రహ్మోత్సవాలు జరిగేలా సామవై నిర్ణయించి జరిపించారు. 10వ శతాబ్దం దాకా ఏటా రెండు బ్రహ్మోత్సవాలు జరిగినట్టు ఆధారాలున్నాయి. తొమ్మిదిరోజుల వేడుకలు ఆమె ప్రారంభించినవే. 966 ఆగస్టు 27న మొదలైన ఈ వేడుకలే తొలి పురటాసి బ్రహ్మోత్సవాలు. ఉత్సవ మూర్తికి పల్లవరాణి అనేక ఆభరణాలను కూడా సమకూర్చారు. ఉత్సవాలకు రథాలు ఏర్పాటు చేశారు. శ్రీవారి మూలవిరాట్టు పాదాల చెంత పద్మపీఠానికి అనించి ఉంచిన భోగశ్రీనివాసుని భక్తులు దర్శించవచ్చు.



శ్రీవారి సేవలో ఉపరాష్ట్రపతి

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగా సీఎం చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. మహ ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయన స్వామిని దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి వాహన మండపంలో పెద్దశేషవాహనంపై ఉత్సవమూర్తులను దర్శనం చేసుకున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.2.85 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,837


తలనీలాలు సమర్పించినవారు: 20,904







శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో చంద్రబాబు కుటుంబీకులు.. సీఎంతో బోర్డు ఛైర్మన్, సభ్యులు, అధికారులు



నాడు : 1970ల నాటి ధ్వజారోహణం









బుధవారం రాత్రి పెద్దశేష వాహన సేవ ముందు కళా ప్రదర్శనలు



నేడు : బుధవారం జరిగిన ధ్వజారోహణం



ఊరేగిన ధ్వజపటం

ధ్వజారోహణానికి ముందు బుధవారం ఉదయం తిరుమల మాడవీధుల్లో ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో జరిగాయి. బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలినివేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. వారి వెనుకనే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంతులను, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకల దేవతామూర్తులకు ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవమూర్తులతో పాటు ధ్వజపటాన్ని ఆలయంలోకి తీసుకువెళ్లి ధ్వజారోహణం నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







ఫల, పుష్ప ప్రదర్శన శాల ప్రారంభం

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ ఫల, పుష్ప, ఫొటో ప్రదర్శన. కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను, రాంభగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, శాంతారామ్, నరేష్‌కుమార్, జంగా కృష్ణమూర్తిలతో కలిసి పలు స్టాల్స్‌ను సందర్శించారు. ఏర్పాటు చేసిన వివిధ శాఖలను అభినందించారు. సీవీఆర్వో రవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుష్ప ప్రదర్శన శాలలో 90 వేల మొక్కలు

వివిధ రంగుల్లో 18 రకాల జాతులను ప్రదర్శనకు ఉంచారు. కూరగాయలు, పండ్లు, పుష్పాలతో రూపొందించిన జంతువులు, పక్షుల బొమ్మలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఆనందనిలయ విమాన వేంకటేశ్వరుని మోసుకెళుతున్న మహాగరుడుడు సైకత శిల్పాన్ని బెంగుళూరుకు కళాకారిణి గౌరి రూపొందించారు. మూడు యుగాలకు సంబంధించిన 14 ఘట్టాలను కళ్లకుకట్టినట్టు చూపేలా ప్రతిమలను ఏర్పాటు చేశారు. మ్యూజిక్, డైలాగులు వినిపించడం వీటి ప్రత్యేకత. టీటీడీ గార్డెన్ విభాగం అధికారులు రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, సురస, ద్రౌపతి స్వయంవరం వంటి పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయుర్వేద, అటవీశాఖల స్టాల్స్, శిల్పకళాశాలల స్టాల్స్ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ పబ్లికేషన్స్ విభాగం అగరబత్తి స్టాల్‌ను ఏర్పాటు చేసింది.





ఎగ్జిబిషన్ ప్రారంభించి పాత చిత్రాలు తిలకిస్తున్న బీఆర్ నాయుడు

పాత చిత్రాల విందు

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో తిరుమల, తిరుపతికి సంబంధించిన పాత ఫోటోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 1940 నుంచి భిన్న ప్రదేశాల్లో భిన్న సందర్భాల్లో తీసిన ఫోటోలు ఇందులో ఉన్నాయి. ఒకే ప్రదేశం నాడు-నేడు అంటూ ఏర్పాటు చేసిన ఫోటోలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.





ద్రౌపది స్వయంవరం



ఫలపుష్ప ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన 'ద్రౌపది స్వయంవరం' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తోంది. గతేడాది 'సీతా స్వయంవరం' స్థానంలోనే దీనిని ప్రస్తుతం ఏర్పాటు చేశారు. 20 రోజుల పాటు 20 మంది నిపుణులు 60 అడుగుల వెడల్పు, 39 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ సెట్టింగ్ కోసం కృషి చేశారు.

మూలస్థాన ఎల్లమ్మకు వెండి గజ వాహనం



వెండి గజ వాహనం

చంద్రగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మకు రూ.కోటి విలువైన వెండి గజ వాహనం వితరణగా అందింది. చంద్రగిరికి చెందిన జీఆర్ విజయరాఘవులు, బేబిరాణి, జీఆర్ చక్రపాణి, సత్యనారాయణన్, హేమావతి వితరణగా అందించారు. దీని బరువు 75 కిలోలు. వినాయక స్వామి ఆలయంలో గజవాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని వాహనాన్ని మోశారు. ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ రాజులుగారి వినోద్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెండి గజ వాహనాన్ని తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

తిరుపతిలో తెలంగాణ యువకుడి హత్య

● రైలు పట్టాల పక్కన ఘాతుకం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్‌గొండ గ్రామానికి చెందిన తమన్నగారి సతీష్‌కుమార్ (23) తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం హత్యకు గురయ్యారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రైలు పట్టాల పక్కన ఈ ఘాతుకం జరిగింది. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. ఆర్‌గొండ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ ఒక్కడే కుమారుడు. ప్రైవేటు విద్యాసంస్థలో పీఈటీగా పనిచేస్తున్న ఇతడికి ఏడాది కిందట వివాహమైంది. గత ఆగస్టు నెలలో వివాహ వార్షికోత్సవం జరిగింది. తర్వాత ఆయన భార్య అలిగి వెళ్లిపోయింది. తర్వాత పీఈటీ ఉద్యోగాన్ని మానేసిన సతీష్‌కుమార్ ఖాళీగా ఉన్నారు. ఈనెల 22న కామారెడ్డి నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఓ దుకాణంలో మద్యం తాగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ బుధవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన, 91-40 విద్యుత్ స్తంభం వద్ద దుండగులు పగులకొట్టిన మద్యం సీసాతో ఇతడి గొంతు కోశారు. వారి నుంచి తప్పించుకున్న సతీష్ కొంత దూరం పరుగెత్తు కుంటూ వెళ్లి కింద పడి మృతి చెందినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. పట్టాల పక్కన మృతదేహం ఉన్న విషయాన్ని కొందరు రైల్వే ప్రయాణికులు రైల్వే ఎస్‌ఐ రత్నమాలకు ఫోనుచేసి సమాచారమిచ్చారు. దీంతో రైల్వే సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ ధర్మేంద్ర రాజు, తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ అధికారులు జయశ్రీ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాజేష్‌గాంధీ, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన మద్యం సీసా, పీఈటీగా పనిచేసిన ఐడీ కార్డు, ఆధార్, పాస్‌పోర్టు, రైలు టికెట్, సెక్యూరిటీ గార్డు పోస్టుకు సంబంధించి రెజ్యూమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐడీ కార్డుల్లోని సెల్‌ఫోను నెంబర్ల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. సాయంత్రం తిరుపతి రైల్వే ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ హత్యకు కారణం ఆయన గ్రామానికి సంబంధించి ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలా లేదా వివాహేతర సంబంధమా? లేకుంటే మద్యం మత్తులో స్థానికంగా ఘర్షణ పడటంతో హత్య చేశారా అనే కోణాల్లో రైల్వే సీఐ ఆశీర్వాదం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.



సతీష్‌కుమార్ (ఫైల్ ఫొటో)

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

మృతదేహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు దగ్గర్లోని బార్ వద్దకు.. అక్కడ్నుంచి అంబేడ్కర్ విగ్రహం, మళ్ళీ బస్టాండులోని వినాయక విగ్రహం వరకు పోలీస్ జాగిలం టైగర్ వెళ్లి ఆగిపోయింది. దీన్ని బట్టి హంతకులు హత్య చేశాక బస్సులో పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

స్విమ్స్‌లో 25 వేల గుండె చికిత్సలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రారంభించిన 32 ఏళ్లలో 25 వేల గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్‌లో 1993లో కార్డియాలజీ విభాగం స్థాపించగా, అదే ఏడాది క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మొదటి గుండె చికిత్సను 1994లో మొదలు పెట్టి ఇప్పటి వరకు 25 వేల గుండె చికిత్సలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వీటిల్లో ఎన్టీఆర్ వైద్యసేవ, టీటీడీ ప్రాణదాన పథకాల కింద 85 శాతం పేదలకు ఉచిత చికిత్సలు అందించామన్నారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

● వృద్ధుడి ఖాతాలో రూ.1.58 లక్షలు హాంఫట్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు రోజుకో రూపంలో బురిడీ కొట్టిస్తున్నారు. తిరుపతికి చెందిన ఓ వృద్ధుడు తాజాగా వీరిలో వలలో చిక్కి రూ. 1.58 లక్షలు పోగొట్టుకున్నాడు. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన 65 ఏళ్ల వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల క్రితం వాట్సాప్ కాల్ చేశాడు. ఇంట్లో ఉంటూనే చిన్న వ్యాపారం చేసుకుని సొమ్ము ఆర్జించవచ్చని నమ్మబలికాడు. తమ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే మిగిలిన వివరాలు పంపుతామన్నాడు. దీంతో బాధితుడు కుమార్తె ద్వారా హాయ్ అని పెట్టించాడు. వెంటనే సైబర్ మోసగాళ్లు మరో అడుగేసి బ్యాంకు ఖాతా,ఆధార్ వివరాలు పంపితే చిరు వ్యాపారానికి సంబంధించి పెట్టుబడి పంపుతామని బురిడీ కొట్టించాడు. సదరు వ్యక్తి వివరాలు పంపగానే బ్యాంకు ఖాతాలోని రూ.1.58 లక్షలు కాజేశారు. మొబైల్‌కు విత్‌డ్రా మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

బెడిసికొట్టిన అరెస్ట్ డ్రామా కాల్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొడుకును అరెస్టు చేశామంటూ ఒక కళాకారుడికి టోపీ వేసేందుకు సైబర్‌నేరగాడు చేసిన విఫలయత్నమిది. ఎంఆర్‌పల్లికి చెందిన ఎమ్మాని వెంకటేశ్వర్లు అనే మ్యూజిక్ లెక్చరర్‌కు బుధవారం ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఎస్‌ఐ యూనిఫాంలో అతని డీపీ ఉంది. మీ హైదరాబాదులో ఉన్న కుమారుడ్ని ఒక కేసులో అరెస్ట్ చేశామన్నాడు. రూ.20వేలు ఫోన్‌పే ద్వారా పంపకపోతే బయటకు రాడంటూ బెదిరించాడు. అబ్బాయితో మాట్లాడించండని వెంకటేశ్వర్లు గట్టిగా గద్దించగా చిన్నబాబుది ఏడుపు స్వరం వినిపించాడు. తనకు హిందీ తెలియదని, ఇంగ్లిషులో మాట్లాడాలని వెంకటేశ్వర్లు రెట్టించేసరికి ఆ సైబర్ నేరగాడు డబ్బులు పంపుతారా లేదా అంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేశారు. తన ఖాతాలో డబ్బులు లేకపోవడంతో నష్టం జరగలేదని వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి చెప్పారు.





చిల్లకూరు: ధాన్యలక్ష్మీదేవి అలంకారంలో ఆదిలక్ష్మి - డక్కిలి: లలితా త్రిపుర సుందరి అలంకరణలో పార్వతీదేవి



నాయుడుపేట: పార్వతీదేవి అలంకారంలో మూకాంబికాదేవి




సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న మన్నారుపోలూరు, నూకలపాలెం గ్రామస్తులు - భువనేశ్వరి అలంకారంలో కన్యకాపమేశ్వరి

కోట: అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాదేవి, లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి

అమ్మ రూపం... అపురూపం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాంకరణ చేశారు. మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం మన్నారుపోలూరు, నూకలపాలెం, వట్రపాలెం గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సారె తీసుకొచ్చిన గ్రామస్తులకు ఆలయ రాజగోపురం వద్ద సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు. అమ్మవారి అలంకారానికి టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు, చండీయాగానికి హైదరాబాదుకు చెందిన బారతుల కల్యాణ్ కుమార్, గాయత్రి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. ఈశ్వరవాక సుందర్‌రెడ్డి, ప్రభావతి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా వాసవి కన్యకా పరమేశ్వరిని భువనేశ్వరిగా అలంకరించారు. అలవల సత్యనారాయణ దంపతులు, ఓలేటి సుబ్రహ్మణ్యం, పాబోలు, మాలేపాటి సుధాకర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి పార్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే మానసాదేవి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవిని అన్నపూర్ణా దేవిగా, బజారు కలశం వద్ద అమ్మవారిని చాముండేశ్వరి దేవిగా, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, రాజరాజేశ్వరీదేవిని అన్నపూర్ణా దేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదీ దేవిని బండాసురవధ అలంకారంలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను గాయత్రిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ఆదిలక్ష్మీదేవిని ధాన్యలక్ష్మీదేగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి రాజరాజేశ్వరి అలంకారం, మూలవిరాట్‌కు అర్ధనారీశ్వరి, కర్ణకమ్మవీధిలోని హరహరక్షేత్రంలో కాత్యయనీదేవికి అన్నపూర్ణదేవిగా, వెంకటేశ్వర స్వామి వరాహావతారంలో, మందనాంచరేశ్వరికి వైష్ణవిదేవిగా దర్శనమిచ్చారు.

డక్కిలి: దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పార్వతీదేవిని త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: పట్టణంలోని దుర్గాదేవిని అన్నపూర్ణదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.









గూడూరు: అన్నపూర్ణాదేవి అలంకరణలో విజయదుర్గాదేవి, రాజరాజేశ్వరీదేవి, గాయత్రిదేవిగా గంగమ్మ, దుర్గాదేవిగా మహాలక్ష్మమ్మ - వెంకటగిరి: రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి, మూలవిరాట్‌కు అర్ధనారీశ్వరి అలంకారం, మందనాంచరేశ్వరిగా వైష్ణవీదేవి

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని సమాజంలో ఆదర్శ వంతంగా మెలగాలని పూర్వ విద్యార్థి, జీఎస్‌టీ ప్రాక్టీషనర్ కోట సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను పెంపొం దించుకుని జీవనో పాధికి అవసరమైన జ్ఞానాన్ని ఆర్జించాలన్నారు. విద్యార్థు ల్లో సామాజిక బాధ్యత, సమాజసేవ, వ్యక్తిత్వ వికాసం, పెంపొందించాలనే లక్ష్యంతో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతుగా రూ.50 వేలు అందజేస్తామన్నారు.

నైపుణ్యాలను పెంపొందించడమే హ్యాకథాన్ లక్ష్యం

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే హ్యాకథాన్ ఉద్దేశమని ప్రొఫెసర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 నిర్వహించారు. విద్యార్థులు పలు నూతన ఆవిష్కరణలను చేపట్టడంతో పాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమస్యల పరిష్కారాలను రూపొందించడంలో సృజనాత్మకతను ప్రదర్శించారు.

వేతన సలహా మండలి చైర్మన్‌కు సన్మానం

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం సలహామండలి చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సీఎం చంద్ర బాబు నాయుడు తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. గతంలో గూడూరు టీడీపీ పరిశీలకుడిగా శ్రీనివాసులురెడ్డి వ్యవహరించి పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. అదేవిధంగా విజయవాడలోని రాష్ట్ర లేబర్ కమిషనర్ శేషగిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి పట్టణంలో కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

సామాజిక సేవలకు పునాది ఎన్‌ఎస్‌ఎస్

పుత్తూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ద్వారా విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఎంఈవో తిరుమలరాజు అన్నారు. ప్ర భుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కుమార్, ఎంస్‌ఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవాభావమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో సమాజానికి సేవ చేయాలన్నదే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రాధమ్మ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీ.ఎన్.రవి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవి మాట్లాడుతూ సేవాకార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వల్ల సమాజంపై బాధ్యత ఇనుమడింపజేస్తుందన్నారు.అధ్యాపకులు షేక్.సాహుల్, శశికళ, శాంతకుమారి, ఫక్రుద్దీన్, ముని దమయంతి, హేమని పాల్గొన్నారు.

బాలకృష్ణాపురంలో వైద్య శిబిరం

సత్యవేడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలకృష్ణాపురంలో బుధవారం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్‌దాస్ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సుబ్రమణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, ఝాన్సి, సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిరిబలిజను రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిబలిజను రద్దు చేయాలని బలిజ సేన అధ్యక్షుడు కె.వెంకటేష్ కోరారు. బుధవారం శ్రీకాళహస్తి తహసీల్దారుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కువశాతం ఉన్న బలిజలకు రిజర్వేషన్లు లేక అణచివేతకు గురవుతున్నారన్నారు. దొమ్మర కులానికి తాము వ్యతిరేకం కాదని వారిని గౌరవిస్తూ మరొక పేరు సూచించాలని తెలిపారు. భాస్కర్, నరేంద్ర, రమణగారి మురళి, జాజాల ముని తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో వచ్చే వ్యాధులపై అవగాహన



ఏర్పేడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజిమేడులో మహిళల్లో వచ్చే వ్యాధులపై అధికారులు అవగాహన కల్పించారు. ఏర్పేడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మహిళలకు పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు.

ప్రకాశం టు చెన్నై వయా నెల్లూరు

- రేషన్ బియ్యం అక్రమ రవాణా రూట్ ఇదీ
- రవాణదారు మహేష్‌రెడ్డిపై కేసు నమోదు
- పట్టుబడిన బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు



నెల్లూరులో పట్టుబడిన బియ్యం లారీలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టైంది. స్మగ్లింగ్ రూటు బహిర్గతం కావడంతో అధికార, రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి చెన్నైలోని మార్కెట్‌కు తరలిస్తూ నెల్లూరులో ఆగడంతో భారీగా బియ్యం పట్టుబడినట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ప్రకాశం జిల్లాలో రేషన్ షాపుల నుంచి సేకరించిన బియ్యం చెన్నై మార్కెట్‌కు తరలించే బాధ్యతను అనంతరసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బట్టిరెడ్డి మహేష్‌రెడ్డి తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పట్టుబడిన లారీలు ఆయనవే కావడంతో మహేష్‌రెడ్డిపై 6ఏ కేసును నమోదు చేయగా, ఇటు నెల్లూరు రూరల్ పోలీసులు సీఎస్ డీటీ జమీర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో 7ఆఫ్ ఈసీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు బుధవారం తెలిపారు. కాగా, పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ నేతృత్వంలోని ఎంఎల్‌ఎస్ గోదాములకు తరలించారు.

నెల్లూరులో ఎందుకు ఆపారు...?

అధికారులకు పట్టుబడింది రెండు లారీల రేషన్ బియ్యమే అయినా, చెన్నైలోని స్మగ్లింగ్ మార్కెట్ కేంద్రంగా భారీ స్మగ్లింగ్ రాకెట్ నడుస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యానికి కొందరు కిలో రూ.10 చొప్పున అమ్మేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మండలాల వారీగా స్మగ్లర్లకు కిలో రూ.15 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. కాగా, వ్యాపారులు రూ.46 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే సిండికేట్లు భారీగా నిల్వచేసి చెన్నైకు తరలిస్తున్నట్లు తాజాగా పట్టుబడిన లారీల ద్వారా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా, మహేష‌రెడ్డి రెండు లారీల్లో రేషన్ బియ్యాన్ని, మరో మూడు లారీల్లో సాధారణ బియ్యాని తరలిస్తూ నెల్లూరులో ఎందుకు ఆపారు...? వీటితో పాటు మరిన్ని లారీలు ఒకేసారి చెన్నై బయల్దేరే అవకాశమేమైన ఉందా...? అన్న అంశాలపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో సుకుమార్‌ను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంపీడీవోగా టీ.సుకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. సుకుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

రికార్డులు లేని ఆటోల సీజ్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో అర్బన్ సీఐ బాబి స్పెషల్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. రికార్డులు లేని 25 ఆటోలను సీజ్ చేశారు.

భూ సమస్యలను పరిష్కరించండి

బాలాయపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు, కోటంబేడు గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల దళితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లిపాడులోని సర్వే నంబరు 53లో గల 149 ఎకరాలను గత పదిహేనేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ భూమిగా తేల్చినా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, గజ్జెల రాజగోపాల్, వెంకటరమణయ్య, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులు సాగును అడ్డుకుంటున్నారు

బాలాయపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు సాగును అడ్డుకుంటున్నారని మండలంలోని పెరిమిడి గిరిజనులు యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఇటీవల రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ భూములుగా గుర్తించారని, అయినా అటవీశాఖ అధికారులు సాగును అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో జ్యోతి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని జంగాలగుంట అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులు రోజువారీ తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. ఉప్పు, చక్కెర. నూనె వాడకం తగ్గించాలని సూచించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

పాలెంపాడులో తాగునీటి బోర్ల సీజ్

దొరవారిసత్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పాలెంపాడు గ్రామంలో తాగునీటి బోర్లను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సీజ్ చేశారు. ఆ గ్రామంలో కొద్ది రోజులుగా కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో ఇటీవల అధికారులు చేతిబోర్లు, డైరెక్ పంపింగ్ స్కీమ్ బోర్లలోని నీటి నమూనాలను రాజమండ్రి పరిశోధన కేంద్రానికి పంపారు. ఆ గ్రామంలోని నీళ్లు తాగడానికి ఉపయోగపడేలా లేవని నివేదిక అందడంతో ఆర్‌డబ్ల్యూఎస్ గూడూరు డివిజన్ ఈఈ సత్తార్ హుస్సేన్, సూళ్లూరుపేట డీఈ చంద్రశేఖర్, ఎంపీడీవో గోవర్దన్ బుధవారం గ్రామంలో పర్యటించి బోర్లను సీజ్ చేశారు. బోర్లలను క్లీనింగ్ చేసే వరకు ఎవ్వరూ నీటిని వాడొద్దని గ్రామస్తులకు సూచించారు. నాయుడుపేట నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేపట్టారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ నగదును బుధవారం లెక్కించారు. రెండు నెలల 13 రోజులకు రూ.3లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ ఈవో నవీన్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, నారాయణ, రవి, నిత్యకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ మహిళా పక్షపాతి



కార్యక్రమంలో బీజేపీ నేతలు చంద్రప్ప, ఎద్దల నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానిమంత్రి మోదీ మహిళా పక్షపాతి అని బీజేపీ నేతలు చంద్రప్ప, ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలచ్చూరు సచివాలయంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. పెళ్లకూరు వైద్యుడు జితేంద్ర ఆధ్వర్యంలో మహిళలందరికీ బీపీ, షుగర్, నోటి, రొమ్ము గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కలిచేటి నరసింహులు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, జనసేన నాయకుడు తాళ్ల రెడ్డిశ్రీనివాస్, రమణ, వీరయ్య, భరత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

కోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, వాకాడు తాలూకా యూనిట్ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు బుధవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. సుదూరంలో ఉన్న తిరుపతికి వెళ్లడం వ్యయప్రయాసాలకు గురవ్వాల్సి వస్తోందన్నారు.

పుత్తూరు వార్తలు

మీనాక్షి దేవి అలంకరణలో ద్రౌపది దేవి





పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు.



వడమాలపేట (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గాయత్రీదేవి అలంకారంలో కన్యాకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. స్థానిక అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీలో మున్సిపల్ సిబ్బంది

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ చెప్పారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం, ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరుచేయడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులు స్కేటింగ్ చేస్తూ ప్లకార్డులు చేతబట్టి ప్లాస్టిక్ నిషేధంపై నినాదాలు చేశారు. భావితరాల ఉనికిని దెబ్బతీసేలా ప్లాస్టిక్ ఉండరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగానికి పాల్పడితే రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. మున్సిపల్ డీఈ లోకేష్, ఏఈలు కార్తికేయ, రమేష్, స్కేటింగ్ కోచ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన విజయ్‌బాబు



పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు తిరుపతికి విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. హోటల్ తాజ్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిటప్యాడ్ వద్ద మంత్రిని కలిశారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



పుత్తూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం జరిగిన మెగా వైద్య శిబిరంలో 783 మంది పలు వైద్య పరీక్షలను చే యించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల భాగస్వామ్యంతో శిబిరం నిర్వహించామన్నారు. మానసిక, చర్మ, కళ్లు, గొంతు పరీక్షలే కాకుండా మహిళలకు డీబీఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేశామని తెలిపారు. డాక్టర్లు హనాఅంజుము, అశోక్‌వర్ధన్ కుమార్, సురేష్, పల్లవి, సస్యశ్రీ, ప్రకాష్‌రావు, సిబ్బంది అన్నాదొరై, రమాగౌరీ, ఆసుపత్రి సలహా కమిటీ సభ్యులు అశోక్, మధు, మోహన పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అమ్మా... దీవించు




బొమ్మలకొలువులో చంద్రఘంట అలంకారంలో జ్ఞానప్రసూనాంబ - అన్నపూర్ణేశ్వరిగా దక్షిణకాళికాదేవి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమ్మా దీవించు కల్పవల్లి అంటూ భక్తులు వేడుకున్నారు. దసరా ఉత్సవాల్లో మూడో రోజు బుధవారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువు దీరిన అమ్మవార్లు భక్తులను తమ చల్లని చూపులతో కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని తపస్సు అలంకారంలో అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయంలో రంగుల గోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారు చంద్రఘంటగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ గాయత్రిదేవిగా అలంకరించారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ముత్యాలమ్మ బ్రహ్మచారిణిగా, శ్రీకాళహస్తి మండలం వేడాంలో దక్షిణకాళికాదేవి అన్నపూర్ణాదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి దేవిని తెన్నాంగూరు పాండురంగ విఠల్, రుక్మిణీ దేవిగా అలంకరించారు. పానగల్ గంగమ్మ ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. తెట్టులో కొలువై ఉన్న నల్లగంగమ్మ మధుర మీనాక్షిగా, భాస్కరపేటలో కొలువై ఉన్న చాముండేశ్వరి, పానగల్ పొన్నాలమ్మ, బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ, తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పోలేరమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి నాగపట్నం నీలాయాదాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. విశ్వబ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీ రోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా బుధవారం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో సర్వ మంగళా దేవి బుధవారం అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో కొలువై ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని పార్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 6.30 గంటలకు అవనాక్షమ్మను బాలా త్రిపుర సుందరిగా అలంకరించి ఊంజలసేవ నిర్వహించారు. కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలం చిందేపల్లిలో కొలువై ఉన్న పార్వతి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ దసరా ఉత్సవాల్లో పార్వతీదేవి అన్నపూర్ణగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అదే విధంగా గుడిమల్లంలో ఆనందవల్లి అమ్మవారు కూడా అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం మరగదాంబిక అమ్మవారు మధుర మీనాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈవో లత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి, అడవికండ్రిగల్లో కొలువై ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో 3వ రోజు అంకాళపరమేశ్వరిదేవి మీనాక్షిదేవి అలంకరణతో భక్తులకు దర్శనభాగ్యం ఇచ్చారు.



కుష్మాండదేవి అలంకారంలో ఏడుగంగమ్మల అమ్మవారు - బ్రహ్మచారిణిగా ముత్యాలమ్మ అమ్మవారు - గాయత్రిదేవిగా ముక్కంటి ఆలయంలోని కాళికాదేవి అమ్మవారు



తెన్నాంగూరు పాండురంగ విఠల్, రుక్మిణిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి - మధురమీనాక్షిగా నల్లగంగమ్మ- నీలాయాదాక్షి అలంకారంలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి - అన్నపూర్ణాదేవిగా పానగల్ పొన్నాలమ్మ- అన్నపూర్ణాదేవిగా బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ- చిట్టత్తూరులో అన్నపూర్ణాదేవిగా పోలేరమ్మ - మహాలక్ష్మి దేవి అలంకరణలో కామాక్షిదేవి



పార్వతి దేవి అలంకరణలో అవనాక్షమ్మ - అన్నపూర్ణ దేవిగా సర్వమంగళాదేవి - అన్నపూర్ణదేవి అలంకారంలో సిద్దేశ్వరాలయంలో పార్వతీదేవి - మధుర మీనాక్షి అలంకరణలో మరగదాంబిక అమ్మవారు - గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న చెంగాళమ్మ పరమేశ్వరి

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తిరుమల పర్యటన నిమిత్తం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం లభించింది. బుధవారం రాత్రి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విమానాశ్రయం చేరుకున్న ఆయనకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

చెంచయ్యనాయుడికి శాప్‌చైర్మన్ పరామర్శ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడును బుధవారం ఆయన నివాసంలో శాప్ చైర్మన్ రవి నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ చెంచయ్యనాయుడు విద్యార్థి దశ నుంచి టీడీపీలో కొనసాగుతున్నారన్నారు. అనేక రాజకీయ, సామాజిక కార్యకలాపాల్లో చెంచయ్యనాయుడుతో తనకు పరిచయం ఉందన్నారు. చెంచయ్యనాయుడుకు రావాల్సిన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్లు తెలిపారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే సుధీర్ చర్చించినట్లు తెలిపారు.

విజయవాడ కనకదుర్గమ్మకు ముక్కంటి పట్టువస్త్రాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి ముక్కంటి ఆలయం తరపున బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి మేళతాళాలు, వేదమంత్రోచ్చరణల నడుమ పట్టువస్త్రాలను కనకదుర్గమ్మ ఆలయ అధికారులకు అందజేశారు. వారిని వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రైల్వే వంతెన కింద ఇరుక్కున్న లారీ



రేణిగుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొత్త చెక్‌పోస్టు వద్ద రైల్వే బ్రిడ్జి కింద లారీ ఇరుక్కుంది. దీంతో అరగంట ట్రాఫిక్ స్తంభించింది. బుధవారం రాత్రి రైల్వే బ్రిడ్జి కింద తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి సరుకులతో వెళ్తున్న లారీ ఇరుక్కుపోవడంతో రెండు వైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పీ4పై సచివాలయ సిబ్బందికి అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బందికి పీ4పై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి మాట్లాడుతూ... మండలంలో బంగారు కుటుంబాల స్థితిగతులను సర్వే చేయాలన్నారు. ఎంఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ... ఆధార్ కార్డు లేని గిరిజన విద్యార్థులకు తహసీల్దార్ బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేశారని సచివాలయ సిబ్బంది వారందరికి ఆధార్ చేయాలని కోరారు. సీహెచ్‌వో రమేష్‌బాబు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు గుంతలను తవ్వుకోండి



కూలీలకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం వర్మీ కంపోస్టు గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా తవుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి తెలిపారు. మండలంలోని ఆర్ అనంతపురం, జీఎన్‌కండ్రిగల్లో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. పది మంది కూలీలు బృందగా ఏర్పడి రోజు వారీ కొలతలు ప్రకారం పని చేస్తే ఒక్కొక్కరు రూ.300 వేతనం పొందవచ్చాన్నారు. నిమ్మ, జామ, జీడి మామిడి, మామిడి, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, అల్ల నేరేడు, చింత, డ్రాగన్ ఫ్రూట్, గూలాబి, రోజా, మల్లెలు, మునగ వంటి తోటలను ఉపాధి పథకం ద్వారా రైతులు చేపట్టాలని సూచించారు.

ఇంటి వద్దకే సీఎం సహాయనిధి



రాధమ్మకు చెక్కును అందిస్తున్న రిషితారెడ్డి, నాగరాజునాయుడు తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో పదిమంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితా రెడ్డి వారి ఇళ్లకే వెళ్లి అందించారు. పాతవీరాపురానికి చెందిన మునెమ్మకు రూ.60వేలు, అంజిమేడుకు చెందిన తమ్మిరెడ్డి తిరుపాల్‌రెడ్డికి రూ.30వేలు, పల్లంకు చెందిన తిరుమలేష్‌కు రూ.30వేలు, ఇసుకతాగేలికి చెందిన ఎం. చెంగమునిరెడ్డికి రూ.56,585, సదాశివపురానికి చెందిన రాధమ్మకు రూ.66,010, ఏర్పేడుకు చెందిన కుసుమకు రూ.23,400, సరస్వతికండ్రిగకు చెందిన వెంకటమునికి రూ.43,184, పాతవీరాపురానికి చెందిన మంగయ్యకు రూ.24,320, చిందేపల్లికి చెందిన పెంచలయ్యకు రూ.80,635 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు సూరినాయుడు, గాలి కృష్ణవేణి, అంకయ్య, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏక్ దిన్.. ఏక్ గంట

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా గురువారం శ్రీకాళహస్తి పట్టణంలో ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ భానుప్రసాద్ తెలిపారు. స్వర్ణముఖి నది తీర ప్రాంతాన్ని ఉదయం 8గంటకు శుభ్రం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ హాజరవుతారని చెప్పారు.



నారా బ్రాహ్మణికి ఘనస్వాగతం



మంత్రులకు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి లోకేశ్ సతీమణి బ్రాహ్మణికి ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి స్వాగతం పలికారు. కలంకారీ శాలువాతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్‌కు కూడా స్వాగతం పలికారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చంద్రప్ప, కండ్రిగ ఉమ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ఆధ్వర్యంలో పారిశుధ్య మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రతిరోజు చెత్తతో, దుమ్ముతో పోరాడుతూ పట్టణ ప్రజలకు శుభ్రమైన వాతావరణం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు నిజమైన అజ్ఞాత హీరోలు అన్నారు. పీఎం మోదీ చెప్పిన స్వచ్ఛ భారత్ స్వప్నం ఈ కార్మికుల కృషితోనే సాకారం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, నాయకులు ప్రియాంక, లత, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణతో ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ అసెంబ్లీ విరామ సమయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ ర్యాలీ



రేణిగుంట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద జీఎస్టీ తగ్గింపుపై టీడీపీ నాయకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలాఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బాలాజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పుష్పనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కొనసాగిన శరన్నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ బుధవారం లక్ష్మీ అలంకరణలో పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, సర్పంచ్ రూపా రామూర్తి, ఉభయదారులు విజయకుమార్, చిన్నంగారి లావణ్య సత్యనారాయణ పాల్గొన్నారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరా

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతిరూరల్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి.



మహాలక్ష్మీ..నమోస్తుతే..


మూలస్థాన ఎల్లమ్మ(చంద్రగిరి)-మిట్టమీద గంగమ్మ-మూలస్థానమ్మ- చాముండేశ్వరీదేవి

లయం ఆవరణలోని సంతోషిమాతకు పార్వతీ దేవి సహస్రనామార్చన, చేశారు. మిట్టమీద గంగమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తొండవాడ ఉగ్రప్రత్యంగిరాదేవి ద్వితీయ దుర్గగా బ్రహ్మచారిణి అలంకరణతో కొలువుదీరారు. **పాకాల:** నేంద్రగుంట మూలస్థానమ్మ దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకానంతరం కుంకుమార్చన చేశారు. **తిరుపతి రూరల్:** తుమ్మలగుంట చెంచువారికాలనీలో మూలస్థాన ఎల్లమ్మ గాయత్రిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయదారులుగా పి.హనుమంతరెడ్డి, పావని, స్నిగ్ధ వ్యవహరించారు. ● ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో అభయమిచ్చారు. ఉభయదారులుగా డి.రాజేశ్వరి, డి.వీణా, ఎం.జయచంద్రా రెడ్డి, ఎం.జయలక్ష్మి వ్యవహరించారు. వినియోగదారుల కోర్టు జడ్జి స్నేహలత, టీడీపీనేత మబ్బు దేవనారాయణరెడ్డి, బీజేపీనేత ఎం.పురుషోత్తంనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. **రామచంద్రాపురం:** శక్తిపీఠంలో మరకత శక్తికాళీ అమ్మవారు త్రిపుర భైరవిదేవిగా దర్శనమిచ్చారు. రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయాల్లో భవానీ అమ్మవార్లు, మహాలక్ష్మి అమ్మవారు, కామాక్షి అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పారకాల్వ రాజరాజేశ్వరిదేవి సరస్వతి దేవి అలంకారంలో భక్తులను కటాయించారు..

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై తిరుపతి గంగమ గాయత్రి దేవి అలంరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

డిగ్రీ విద్యార్థిపై హత్యాయత్నం

● తిరుచానూరు,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో ఏర్పడిన వివాదం ఓ యువకుడిపై హత్యాయత్నానికి దారితీసిన వైనమిది. చెలరేగిపోతున్న గంజాయి బ్యాచ్ దాష్టీకానికి దర్పణం పడుతున్న సంఘటన ఇది. సీఐ సునీల్‌కుమార్ కథకం ప్రకారం తిరుచానూరుకు చెందిన తోటకూర దినేష్, కుహల్ మిత్రులు. వీరు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మిత్రుల మధ్య వాట్సాప్‌ల ద్వారా చాటింగ్ జరిగింది. అది కాస్తా తీవ్ర వివాదానికి దారితీసింది. కుహల్ గట్టిగా హెచ్చరికలు చేశాడు. అక్కడితో ఆగకుండా ఫోన్ పెట్టేసి 20 మంది గంజాయి బ్యాచ్‌ను వెంటబెట్టుకుని తిరుచానూరు నేతాజీరోడ్డులో ఉంటున్న దినేష్ ఇంటికి చేరుకున్నాడు. వారు దినేష్‌ను బయటకు లాగి కత్తితో పొట్టలో పొడిచారు. అడ్డు వచ్చిన అతడి అమ్మ మునెమ్మ మీద కూడా దాడి చేశారు. గా యపరిచారు. తర్వాత అక్కడే కాస్సేపు వికటాట్టహాసం చేసి నిష్క్రమించారు. కాస్సేపటికి కాలనీ వాసులు బయటకు వచ్చి దినేష్‌ను రుయాకు తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేస్తున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.



చికిత్స పొందుతున్నదినేష్

ఎన్ఎస్ఎస్ డే

పాకాల: స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. బాలుర కళాశాలలో ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరినాధ్ ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రెడ్డిరామరాజు మాట్లాడారు.విజయలక్ష్మీదేవి పాల్గొన్నారు













తిరుపతి

గంగమ్మకు వెండి చెంబులు వితరణ





వెండి చెంబులు వితరణ చేస్తున్న డిప్యూటీ మేయర్ మునికృష్ణ దంపతులు

తిరుపతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ అభిషేకానికి వినియోగించే 2 వెండి చెంబులను తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ దంపతులు బుధవారం వితరణ చేశారు. దేవి నవరాత్రుల సందర్భంగా సుమారు రూ.2లక్షలకు పైగా విలువగల (1,250 గ్రాముల) వెండి చెంబులను ఆలయ ఈవో జయకుమార్, ఛైర్మన్ మహేష్ యాదవ్, ప్రధాన అర్చకుడు మురళి స్వామిలకు అందజేశారు. తమ కుటుంబానికి ఏ సమస్య వచ్చిన అమ్మ వారికే మొక్కుతామని ఈ సందర్భంగా ఆర్సీ చెప్పారు. ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్వీయూలో పరిశోధన ప్రయోగశాల భవన నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ భవనానికి వీసీ అప్పారావు బుధవారం శంకుస్థాపన చేశారు. పరిశోధన అవసరాల కోసం రూ.6 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో దీన్ని నిర్మించనున్నట్లు వీసీ అప్పారావు తెలిపారు. పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలకు ఈ భవనం వేదిక కానుందని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ నరసింహ, రూసా సీఈవో వంశీ, ఇంజినీర్ తాండవకృష్ణ, ప్రిన్సిపాల్ పద్మావతి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మంత్రుల అభినందనలు



కలెక్టర్‌ను అభినందిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టులో భాగంగా స్కోచ్ సంస్థ నుంచి గోల్డెన్ పురస్కారం అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, అధికార యంత్రాంగాన్ని బుధవారం రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ వారి వెంట ఉన్నారు.

పరకామణి దొంగలను కఠినంగా శిక్షించాలి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణిలో చోరీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీవారిపై భక్తితో భక్తులు సమర్పించిన కానుకలను ఒక మతం ఉద్యోగి 15 ఏళ్లుగా దోచుకుంటున్నా టీటీడీ విజిలెన్స్ పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. సదరు ఉద్యోగి పట్టుబడినా చర్యలు తీసుకోకుండా అతడి ఆస్తిని దోచుకున్న గత ప్రభుత్వ పెద్దలపైనా ఇప్పటివరకు చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోందని తెలిపారు. శ్రీవారి సొమ్మును స్వాహాచేసిన వారిని వదిలేది లేదని సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఆ మేరకు కార్యాచరణ అమలు చేయాలని కోరారు. తిరుపతిలో కొందరు కూటమినేతలు భూదందాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారితో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపైనా దృష్టి సారించాల్సిన అవసరముందని తెలిపారు. లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమీకృత వ్యవసాయంతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒకే పంటకు బదులు రెండు, మూడు సాగు చేయడం వల్ల అధిక దిగుబడి, ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త రామ్‌కుమార్ అన్నారు. తిరుపతి రాస్ సేవా నిలయంలో బుధవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) సంయుక్తంగా సమీకృత వ్యవసాయ విధానంపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆహార, ఉద్యాన, పశుపోషణకు సంబంధించిన పంటలను పండించడం వల్ల మూడు రకాలుగా లబ్ధిపొందే అవకాశాలు ఉంటాయని తెలిపారు. దీంతోపాటు గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్ల పెంపకం చేపడితే అధిక లాభాలు వస్తాయన్నారు. సాంకేతిక పద్ధతులను వివరించారు. చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల మండలాల నుంచి రైతులు వచ్చారు.

గాంధీరోడ్డువాసుల తాగునీటి సమస్యకు పరిష్కారం

- కొత్త బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్న గాంధీ రోడ్డు వాసులకు ఊరట లభించింది. కూటమి నాయకుల కృషితో ఎట్టకేలకు ఏర్పాటైన కొత్త బోరు మోటారును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బోరులో నాలుగున్నర ఇంచుల నీరు పడ్డాయని, వీటిని చుట్టుపక్కల ప్రాంతాలకు ఇస్తామని తెలిపారు. బోరు ఏర్పాటుకు కృషి చేసిన కార్పొరేటర్ నరసింహను అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్, స్థానిక కార్పొరేటర్ నరసింహ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్ నరేంద్ర, నాయకులు వరికుంట నారాయణ, వేణు, దూది శివ తదితరులు పాల్గొన్నారు.

పరకామణి దొంగలను చట్టం ముందు నిలబెడతాం

- భానుప్రకాష్‌రెడ్డికి మంత్రి లోకేశ్ ప్రశంసలు



భానుప్రకాష్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణిలో దొంగతనం వ్యవహారాన్ని వీడియోలతో సహా బయటపెట్టిన టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. త్వరలోనే నిందితులను చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన డాలర్ల చోరీ, నిందితులకు వైసీపీ పెద్దలు కొమ్ముకాసి కేసును రాజీచేసిన వైనం గురించి భానుప్రకాష్‌రెడ్డితో లోకేశ్ మాట్లాడారు. ఇంకా పలు వ్యవహారాల గురించి ఆరా తీశారు. శ్రీవారి పట్ల చిన్న తప్పిదం చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

లైఫ్ స్కిల్స్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్‌పై నగరంలోని పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గతనెల రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శారీరక, మానసిక ఇబ్బందులను అధిగమించి జీవిత లక్ష్యాన్ని విద్యార్థులు నెరవేర్చుకోవాలని ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు హేమావతి సూచించారు.



రోడ్డుపైకి ర్యాంప్

స్థానికుల అభ్యంతరం

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎదురుగా గల గాయత్రీనగర్ అంకమ్మ ఆలయానికి సమీపంలో ఇంటి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఇంటి ప్రధాన గేటు నుంచి సుమారు పది అడుగులు రోడ్డుపైకి ర్యాంపు వేయడంతో పక్క ఇంటి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారినట్టు చెబుతున్నారు. ఇంటి యజమానికి చెప్పినా పట్టించుకోవడంలేదని, కార్పొరేషన్ అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వేద వర్సిటీలో అక్రమాలపై విచారణ జరపాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి (బీజేపీ), హేమంత్ రాయల్ (టీఎన్ఎస్ఎఫ్), హిమవంత్ (జనసేన) కోరారు. పదోన్నతుల్లో ఉన్నతాధికారులు దోబూచులాడారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రూ.30 లక్షలు డ్రా చేసి వైసీపీ వేగులకు అందజేశారని తెలిపారు. ఈ అంశాలపై విచారణ జరపాలని కోరారు.

గాయత్రీదేవి అలంకారంలో గంగమ్మ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్టుకు పాలు, పెరుగు, పసుపు, కుంకుమ వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి హారతులు సమర్పించారు. కుంకుమార్చన చేసి హోమ పూజలను అత్యంత వేడుకగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి గాయత్రీదేవి అలంకారం చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఊంజల్ సేవ అత్యంత వేడుకగా జరిగింది. కోర్టు సమీపంలోని వేశాలమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గాంధీ విగ్రహం సమీపంలోని పెద్దగంగమ్మ, పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ కూడా అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తజనులకు దర్శన భాగ్యం కల్పించారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు ఆదిపరాశక్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేడుకగా హోమ పూజలు





అన్నపూర్ణాదేవి అలంకారంలో వేశాలమ్మ, నడివీధి గంగమ్మ

కాత్యాయని అలంకరణలో అన్నపూర్ణదేవి



కాత్యాయని అలంకరణలో లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి



మహారాణి అలంకరణలో కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి బుధవారం కాత్యాయని అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం శాస్త్రోక్తపూజలు, నివేదన సమర్పించారు. రాత్రి కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారి మూలవర్లు మహారాణి అలంకరణలో, ఉత్సవమూర్తి రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులను కటాక్షించారు.



ఆదిపరాశక్తిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిపరాశక్తి దేవి అలంకరణలో బొంతాలమ్మ భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్, ఆదిమూలం, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి

సీఎంకు స్వాగతం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు తిరుచానూరు తాజ్ హోటల్ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఇందులో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, ఆదిమూలం, సీఎం స్పెషల్ సెక్రటరీ ఎ.వి.రాజమౌళి, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్ దివాకర్‌రెడ్డి, హరిప్రసాద్, రుద్రకోటి సదాశివం, జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ఉన్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నేత హరిప్రసాద్

సదరన్ డిస్కం సీజీఎంకు అభినందనల వెల్లువ



మురళీకుమార్‌ను అభినందిస్తున్న స్నేహితులు, అధికారులు, ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం చీఫ్ జనరల్ మేనేజరు మురళీ కుమార్‌ను స్నేహితులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు. జీఎం నుంచి సీజీఎం రెవెన్యూ విభాగానికి పదోన్నతి పొందిన ఆయన బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ క్రమంలో డిస్కం కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. అభినందించిన వారిలో జీఎంలు ఎం కృష్ణారెడ్డి, చక్రపాణి, టి.జయరాం, కె.వాసుదేవరెడ్డి, ప్రసాద్, విజయభాస్కర్, డి.బాబు, ఏఏవోలు శివశంకర్, మధు, విశ్రాంత సీజీఎం కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, పలువురు విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. కాగా, సీజీఎంగా వారం క్రితం పదోన్నతి ఆర్డర్ తీసుకున్న సి.సురేంద్రనాయుడు (ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్) ఆ రోజే బాధ్యతలు తీసుకున్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి: సీఐటీయూ



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని అమలుచేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం కోరారు. ఈ మేరకు బుధవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అసెంబ్లీలో చట్టం చేయడం దారుణమన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 13 గంటల పని విధానాన్ని అమలు చేస్తే కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారని మండిపడ్డారు. ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయచంద్ర, మునిరాజా, బుజ్జి, నరేంద్ర, వాసు పాల్గొన్నారు.

- స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట స్టోర్స్ హమాలీలు చేపట్టిన నిరసన రిలే దీక్షలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. సమస్యలు పర్కిరించేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

శివజ్యోతినగర్‌లో నీటి సమస్యను పరిష్కరించండి

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని శివజ్యోతినగర్‌లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించేందుకు చొరవ చూపాలని టీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రాదారపు చాళుక్య మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. బుధవారం తిరుపతికి వచ్చిన మంత్రికి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. కపిలతీర్థం వద్ద వర్షపునీరు వృథాగా అక్కారంపల్లి చెరువులోకి కలుస్తోందని, అదే సమయంలో శివజ్యోతినగర్, అయ్యప్పకాలనీ, సత్యనారాయణపురం, భూపాల్‌నగర్, రాయల్‌నగర్, జీవకోన, రాజీవ్‌నగర్, క్రాంతినగర్ వంటి కాలనీలో వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని వివరించారు. కపిలతీర్థం నుంచి వచ్చే నీటిని నిల్వచేయగలిగితే సమస్యను అధిగమించవచ్చునని తెలిపారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



సీఎంకు రుద్రకోటి స్వాగతం

తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలుసమర్పించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు.

\- తిరుపతి, (ఆంధ్రజ్యోతి)

'ఓజీ' సినిమా రిలీజ్ సంబరాలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా విడుదల సందర్భంగా స్థానిక పళని థియేటర్‌లో జనసేన నేత కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో భారీ కేక్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అభిమానులు పెద్దయెత్తున హాజరై థియేటర్ ముందు సందడి చేశారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ ఈ సినిమా అన్ని రికార్డులు బద్దలు కొడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




కేక్ కట్ చేస్తున్న కిరణ్ రాయల్, పవన్ అభిమానులు





తిరుపతికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం



తిరుపతికొచ్చిన మంత్రి నారా లోకేశ్, భువనేశ్వరిని హెలిప్యాడ్ వద్ద కుటుంబీకులతో వెళ్లి కలిసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

లోపలకు చొచ్చుకొచ్చి.. గొలుసు లాక్కెళ్లి

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయి నగర్ పంచాయతీలో మంగమ్మ అనే వృద్ధురాలి మెడలో బలవంతంగా గొలుసు లాక్కెళ్లాడో దుండగుడు. రూరల్ సీఐ టి.చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. భర్త మృతిచెందడంతో మంగమ్మ ఒంటరిగా ఉంటున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఆమె ఇంటి తలుపులు ఎవరో బలంగా కొట్టారు. ఆమె తలుపు తీయగానే, గుర్తు తెలియని వ్యక్తి బలవంతంగా లోపలకు వచ్చి, ఆమె మెడలోని 24 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు.ఆమె కేకలతో అంతస్తులో అద్దెకున్న వారు కిందకు వచ్చారు. అప్పటికే నిందితుడు పారిపోయాడు. డయల్ 100కు ఆమె ఫిర్యాదు చేయగా తిరుపతి రూరల్ పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

వీసీ, రిజిస్ట్రార్‌ను కలిసిన బీఈఎఫ్ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బీఈఎఫ్) నేతలు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బీఈఎఫ్ గౌరవాధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు బాలాజీ, నేతలు సంగీతం సుబ్రమణ్యం, రఘురాములు, పద్మనాభం తదితరులు అధికారులను శాలువాతో సన్మానించారు.